# చంద్రలోక యాత్ర

అభివృద్ధి చెందుతున్న దేశాలలో అదొకటి.

రీతులూ, నీతులూ వేరైనా, అన్ని దేశాలూ ఆశించేది అభివృద్ధి. రోజు రోజుకూ పెరుగుతున్న విజ్ఞానాన్ని మానవ శాంతికీ, మారణ హోమానికీ ఒకే రకంగా ఉపయోగించ డానికి అలవాటు పడ్డ దేశాలు వేసిన మార్గంలో, ఈ అభివృద్ధి చెందుతున్న దేశాలు వెనుకగా ప్రయాణించడం నేర్చుకున్నాయి. అలా ప్రయాణం చేస్తున్న దేశాల్లో మొదట

నే చెప్పిన దేశం ఇరవయ్యొకటో శతాబ్దంలో ఒక సంవత్సరంలో చంద్రలోక యాత్ర తలపెట్టింది.

అంతరిక్ష యాన కేంద్రంలోని పర్యవేక్షణశాఖలో శాస్త్రజ్ఞులూ, సాంకేతిక నిపుణులూ నిద్రాహారాలు మాని, తమ తమ విధుల్ని నిర్వహిస్తున్నారు. చంద్రుని చుట్టూ పరిభ్రమి స్తోంది, విశ్వాంతరాళంలోకి ఆ దేశంచే పంపబడిన మొదటి గ్రహాంతర నౌక 'చంద్రగామి'

ఉన్నట్టుండి కమాండర్ గొంతు వినవచ్చింది.

"మూడో నెంబరు ఆక్సిజన్ టాంక్ బీటలు వారిపోయి, ఆక్సిజన్ అంతా అనంతంలో కలిసిపోయింది. అయితే ప్రమాదం ఏం జరగలేదు. ముందు కార్యక్రమం?"

అలసి కూర్చున్న చంద్రయాన డైరెక్టర్‌కి 'లాగి లెంపకాయ కొట్టి, నా చెయ్యి కంది పోలేదు - నీ దవడ ఎలా ఉంది?' అని అడిగినట్టనిపించింది. రెండు వందల కళ్లు డైరెక్టర్‌ని చూస్తూ ఉండిపోయాయి. టెలివిజన్ స్క్రీన్‌కు అంటుకుపోయిన అంతరిక్ష శాఖా మంత్రి డైరెక్టర్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

డైరెక్టర్ మైక్రోఫోన్‌లో కమాండర్‌ని ఉద్దేశించి, "అలాగే కక్ష్యలో ఉండండి. కొన్ని నిమిషాల్లో ఏం చెయ్యవలసిందీ చెబుతాను" అని చుట్టూ ఉన్నవాళ్ళని చూసి, "మీ దృష్టి ఉండవలసింది నా మీద కాదు; మీ ముందున్న పరికరాల మీద" అంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళి కంప్యూటర్ ముందు నిలబడ్డాడు.

కమాండర్ గొంతు విని కంప్యూటర్ దగ్గరకు వెళ్ళిన అర నిమిషంలోనూ, డైరెక్టర్ మెదడు కంప్యూటర్ కంటే వేగంగా ఆలోచించింది.

'సవ్యమైన పరిస్థితిలో చంద్రుని చుట్టూ పరిభ్రమణం చేస్తున్న చంద్రగామి, ఆ పరిభ్రమణం పూర్తికాగానే, మూన్ లాండర్ చంద్ర చకోరాన్ని వదులుతుంది. అందులో కమాండర్, మరో శాస్త్రజ్ఞుడూ పయనించి చంద్రుని మీద దిగవలసి ఉంది. చంద్రోపరితలం మీద ఇరవై నాలుగు గంటలు పరిశోధనలు జరిపిన తదనంతరం వాళ్ళిద్దరూ తిరిగి చకోరం ద్వారా చంద్రగామిని చేరుకుంటారు. ఆ లోపుగా నేవిగేటర్ చంద్రగామిలో పరిభ్రమణలు చేస్తూనే ఉంటాడు. చకోరం చంద్రగామిని చేరుకున్న తరువాత చకోరాన్ని చంద్రుని మీద వదిలి, వాళ్లు ముగ్గురూ భూమికి ప్రయాణం సాగిస్తారు. కాని ఈ అవాంతరం మూలాన...'

డైరెక్టర్ తన ఆలోచనలని కంప్యూటర్‌కి అందించాడు. మరుక్షణంలో కంప్యూటర్ నుండి సమాధానం లభించింది. ఆ కాగితాన్ని చూస్తూ కులాసాగా నవ్వుకుంటూ, తన కుర్చీ దగ్గరకు వెళ్లి మైక్రోఫోన్ అందుకున్నాడు. డైరెక్టరు తీరు చూసి అందరూ హాయిగా ఊపిరి తీశారు. అయితే అతగాడన్న మాటలు విని కొయ్యబారిపోయారు.

"కమాండర్, నేను చెప్పేది శ్రద్ధగా విను. వివాదాలకి సమయం లేదు. ఇప్పుడు జరిగిన ఈ అవాంతరం దృష్ట్యా నేను రెండు మార్గాలు సూచిస్తున్నాను. ఒకటి - చంద్రుని మీద దిగడం మాట మరిచి, మీరు ముగ్గురూ సురక్షితంగా వెంటనే భూమికి తిరిగి

రాగలందులకు సరిపడే ప్రాణవాయువు ఉంది. అందుకని మీరు మరో పదిహేను నిమిషాల్లోగా చంద్రుని ఆకర్షణశక్తి నుండి తప్పుకోవడానికి రాకెట్లను ప్రయోగించి, భూమి వైపు పయనించడం. రెండవది - అమితమైన వ్యయప్రయాసలకోర్చి, మన దేశం మొదటి సారిగా సాధిస్తున్న ఈ చంద్ర మండలయాత్ర చివరి క్షణంలో భగ్నం కాకుండా ఉండాలంటే, ఒక త్యాగం చెయ్యవలసి వస్తుంది. అది మీ ముగ్గురిలో ఎవరో ఒకరు ప్రాణత్యాగం చెయ్యడం. అప్పుడు ఒక మనిషి చకోరం ద్వారా చంద్రమండలం మీద పది గంటల సేపు ఉండి, తిరిగి చంద్రగామి చేరుకోవచ్చు. చంద్రగామి చేరుకున్న తరువాత ఇద్దరూ భూమికి సురక్షితంగా చేరుకోగలరు. ఆలోచించి సరిగ్గా అయిదు నిమిషాల్లో నాకు సమాధానం చెప్పు. తరువాత కార్యక్రమం ఆదేశిస్తాను''

డైరెక్టర్ ఈ మాటల్లో సాటి మానవుణ్ణి నిర్దాక్షిణ్యంగా మృత్యుకుహరంలోకి పంపుతున్నానన్న చింతన లేదు. అంతరిక్ష గ్రహాంతరయానంలో తన దేశం కూడా విజయాన్ని సాధించాలన్న తపన మాత్రం కొట్టవచ్చినట్లు కనబడింది.

శాస్త్రజ్ఞులూ, సాంకేతిక నిపుణులూ డైరెక్టర్ నిర్ణయానికి ఆశ్చర్యపోయారు. అక్కడున్న ముగ్గురూ సూచించిన రెండో మార్గానికి ఒప్పుకొంటారని అందరికీ తెలుసు. వాళ్ల క్రమశిక్షణ అటువంటిది. ప్రాణాలకు తెగించి వెళ్లిన వాళ్ళను, కావాలని ప్రాణం తీసుకోవడం కష్టమేమీ కాదు. అయితే ఆ ముగ్గురిలోనూ ఎవరు ప్రాణత్యాగం చేస్తారు? అందులోనూ ఆ నిర్ణయం అయిదు నిమిషాల్లో తీసుకోవాలి. తామే ఆ పరిస్థితిలో ఉంటే, ఏం చేసేవారు? ప్రతివాళ్ల మనస్సుల్లోనూ ఇవే ప్రశ్నలు.

ఉన్నట్టుండి మంత్రి అన్నాడు: "అలా జరగడానికి వీల్లేదు. వాళ్లు ముగ్గురూ సురక్షితంగా తిరిగి రావలసిందే"

"సర్, ఆరు వందల కోట్లు ఖర్చు చేసిన ఈ మహాయజ్ఞం, ఈ వైజ్ఞానిక ప్రయోగం, బూడిదలో పోసిన పన్నీరు కాకుండా ఉండాలన్నా, మన దేశం పొందబోతున్న ఖ్యాతి చేయి జారిపోకుండా ఉండాలన్నా ఇదొక్కటే మార్గం. దయచేసి మీరీ విషయంలో కలుగ జేసుకోవద్దు. తరువాత నేను దేశానికి సమాధానం చెప్పుకొంటాను" చంద్రమండల యాత్ర జరిగి తీరాలన్న పట్టుదలతో డైరెక్టర్ అన్నాడు.

"ఆరు వందల కోట్లు కాదు కదా, అరవై వేల కోట్లు ఖర్చు చేసినా, ప్రాణాలు తీసే హక్కు నీకు లేదు."

"దేశాలు యుగాల నుంచి చేస్తున్న యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన సైనికుల మాట? ప్రజల మాట?"

"అవి దేశాల్ని రక్షించడం కోసం"

"దేశాల్ని జయించడం కోసమైనా, రక్షించడం కోసమైనా జన నష్టానికి సిద్ధపడే యుద్ధాలు జరుగుతున్నాయి. సాంకేతిక, వైజ్ఞానిక రంగంలో ఇది కూడా ఒక యుద్ధం లాంటిదే. ఇది దేశ ప్రగతిని సాధించడం కోసం, దేశ ఖ్యాతిని రక్షించడం కోసం."

"ఇది ప్రభుత్వం ఆజ్ఞ. వాళ్ళని తిరిగి రమ్మని ఆదేశించు"

మంత్రి మాటలు విని డైరెక్టర్‌లో కోపం కట్టలు తెంచుకుని ప్రవహించింది. మైక్రోఫోన్‌లో అన్నాడు: "కమాండర్, మీ నిర్ణయం మాట దేముడెరుగు. కాని, వెంటనే మీరు చంద్ర పరిభ్రమణం మాని, భూమికి తిరిగి రండి."

"నో, సర్. తీరా..." కమాండర్ మాటల్ని మధ్యలోనే ఆపుచేశాడు డైరెక్టర్. "రెండో మాట అనవసరం. ఇది నా ఆజ్ఞ. మీరు సిద్ధంగా ఉండండి. సరిగ్గా నాలుగున్నర నిమిషాల్లో ఇక్కడున్న కంట్రోళ్ళ ద్వారా మీ రాకెట్లని పనిచేయిస్తున్నాను".

అతని మాటల్లో కర్కశత్వం అందరికీ కొట్టవచ్చినట్లు కనబడింది.

బయట వున్న పత్రికా విలేఖరుల వద్దకు పరుగెత్తాడు మంత్రివర్యుడు.

వాళ్ళు సురక్షితంగా తిరిగి వచ్చేవరకూ దేశం నిద్ర పోలేదు. ప్రజా, ప్రభుత్వమూ డైరెక్టర్‌ని దుమ్మెత్తిపోశాయి.

తిరిగి వచ్చిన ముగ్గుర్నీ మొదటగా కలుసుకున్న డైరెక్టర్ అభినందించాడు. "నా మూర్ఖత్వానికి మీలో ఎవరు బలై ఉండేవారు?" నెమ్మదిగా అడిగాడు.

"ముగ్గురమూ నేనంటే నేనని ముందుకు వచ్చాం. కాని కమాండర్‌గా ఆ అవకాశం వాళ్ళకివ్వకుండా నేనే తీసుకున్నాను. కాని మీరు..." కమాండర్ అన్నాడు.

"నేను మీ ముగ్గుర్నీ చూసి చాలా గర్విస్తున్నాను" డైరెక్టర్ వాళ్ల భుజాల్ని తడుతూ అన్నాడు. చివరిక్షణంలో భగ్నమైన ఆ యాత్రని గురించి బాధపడ్డవాళ్ళు ఆ నలుగురే.

దేశం వాళ్ళకు ఘనమైన స్వాగతాన్నిచ్చింది. ప్రజలు జోహార్లర్పించారు. పత్రికలు వారిని చేరలేని గగనాలకు ఎత్తి పారేశాయి.

డైరెక్టరు రాజీనామా ఇచ్చి పారేశాడు.

ఏడాది లోపుగా....

తనని కమాండర్‌గా పంపించలేదన్న ఉక్రోషం కొద్దీ తాగుడు మైకంలో ఉన్న మరో ఆఫీసరు చంద్రగామి కమాండర్ని ఒక క్లబ్ పార్టీలో కాల్చిపారేశాడు.

మనశ్శాంతి కోసం సముద్రతీరానికి పోయిన శాస్త్రజ్ఞుడు, సముద్రంలో స్నానం చేస్తుండగా ఒక పెద్ద అల విరుచుకుపడ్డంతో సాగర గర్భంలో కలిసిపోయాడు.

ఆ దేశం ఎయిర్‌ఫోర్సు వాళ్ళు తయారు చేసిన కొత్త రకం యుద్ధ విమానాన్ని, అరవై వేల అడుగుల ఎత్తున పరీక్షిస్తున్న నేవిగేటర్, ఆ విమానం కూలి మట్టిలో కలిసిపోయారు.

మాజీ చంద్రయాన డైరెక్టర్ దేశం రెండింటికీ చెడ్డ రేవడైందని ఏడ్చాడంటే, ఏడవడూ మరి!

*(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక : 27-12-1978)*